క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



నూజివీడు: మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం పనులలో మునిసిపల్ సిబ్బంది అలసత్వం వహించొద్దని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రతి రోజు వార్డుల్లో తిరిగి పని చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో నూజివీడు అభివృద్ధికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో సోమవారం పింఛన్ల పంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.11 కోట్లతో పైపు లైన్ల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు వంటి పనులు చేపడతామన్నారు.

ట్రిపుల్ ఐటీలో ధ్రువపత్రాల పరిశీలన



నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల అడ్మిషన్లలో భాగంగా నూజివీడు ట్రిపుల్ ఐటీలో సోమవారం ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. తొలిరోజు సైనిక సంతతి కోటాలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఆహ్వానించి వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ పరిశీలనకు 48 మంది అభ్యర్థులు హాజరైనట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం సైనిక సంతతి కోటా అభ్యర్థులతో పాటు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు.

నూతన నేర చట్టాలపై అవగాహన సదస్సు



నూజివీడు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి అన్నారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొత్త నేర చట్టాలపై ప్రజలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొత్త చట్టాలతో జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ పద్ధతిలో సమన్లు పంపడం తదితర అధునాతన పద్ధతులు న్యాయ వ్యవస్థలోకి రానున్నాయన్నారు. మైనర్‌పై సామూహిక అత్యాచారానికి మరణ శిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన తెచ్చారన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై శిక్షలను మరింత కఠినం చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామకృష్ణ, కేఎస్ఎన్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం



తిరువూరు: నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులకు తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. స్థానిక సిద్ధార్థ స్కూలులో తమ పిల్లలను చదివిస్తున్న సోమవరపు సురేష్, రమలకు దోస్త్ పూర్వవిద్యార్థుల సంఘం తరఫున 2024–25 విద్యాసంవత్సరానికి అవసరమైన ఫీజులను చెల్లించారు. దోస్త్ సభ్యులు పరసా నెహ్రూజీ, దుక్కిపాటి మురళీకృష్ణ, చిత్తలూరి సోమశేఖర్, యలమంచిలి నాగమల్లేశ్వరరావు, గుడివాడ నరేంద్ర, గట్లు మురళీకృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణి పాల్గొన్నారు.

4న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

జి.కొండూరు: జి.కొండూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన ఈ నెల 4వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

వైద్య వృత్తి ఎంతో ఉన్నతం





మైలవరంలో వైద్యులను సత్కరిస్తున్న కోయ సుధ, ట్రస్టు సభ్యులు; తిరువూరు ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు గార్గేయిని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మైలవరం: వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడు టి.శ్రీధర్ తెలిపారు. మైలవరంలో లయన్స్ క్లబ్ కార్యాలయంలో సోమవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం కార్యదర్శి సీహెచ్ నాగభూషణం, కోశాధికారి కె.నాగప్రసాద్, పూర్వ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, సభ్యులు లేళ్ళ ఏడుకొండలు, చలువాది హరీష్ కుమార్ గుప్త, రామిరెడ్డి, కోయ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పునర్జన్మను ప్రసాదించే వైద్యులు

మైలవరంలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో జరిగిన డాక్టర్స్ డే కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ మాట్లాడుతూ తల్లి జన్మనిస్తుందని, వైద్యులు పునర్జన్మనిస్తారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు బి.విజయ్ ప్రకాష్, డాక్టర్ సీహెచ్ అమర్, డాక్టర్ సూర్య, డాక్టర్ హరిబాబు, గైనకాలజిస్టు డాక్టర్ నిఖిత, డాక్టర్ నిహిత, జరూష, రమ్య, ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు పూర్ణచంద్రరావు, డాక్టర్ శిరీష, డాక్టర్ కె.కృష్ణకిషోర్, ఈఎన్‌టీ వైద్యురాలు హసీనా బేగం, ఆయుర్వేద వైద్యుడు నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

తిరువూరులో వైద్యులకు సత్కారం

తిరువూరు: తిరువూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి గార్గేయి, ప్రైవేటు వైద్యులు రవీంద్ర, తాళ్ళూరి రామకోటేశ్వరరావు, భానుతేజ, చంద్రశేఖరరెడ్డిలను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు రాజేష్‌ఖన్నా, అడుసుమల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, నాళ్ళ రాజారావు, నాగుబండి ప్రకాశరావు సత్కరించారు. ఐడియాస్ సేవా సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి పలువురు వైద్యులను సత్కరించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కూడా డాక్టర్స్ డే నిర్వహించారు.

సమాజంలో ఆధునిక దేవుళ్లు వైద్యులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): నేటి సమాజంలో వైద్యులు ఆధునిక దేవుళ్లని లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండస్ట్రియల్ పార్క్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి అన్నారు. కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ డే వేడుకలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ మొదటి ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జన్మదినాన్ని డాక్టర్స్ డే గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం అంకితభావంతో పనిచేస్తున్న వైద్యుల సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.పద్మావతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎ.సురేష్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

జి.కొండూరు: డాక్టర్స్ డేను పురస్కరించుకొని ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ ఆధ్వర్యంలో జి.కొండూరు మండల వైద్యాధికారి డాక్టర్ శ్వేత, స్థానిక ప్రయివేటు వైద్యుడు శాగం దినేష్‌రెడ్డిని సంఘం ప్రతినిధులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోలా రాఘవరాజు, తెలుగు ఉపాధ్యాయురాలు సందిపాము లిల్లమ్మ మాట్లాడుతూ ప్రజారోగ్య రక్షణలో వైద్యులది కీలకపాత్ర అని వివరించారు. నిత్యం ప్రజారోగ్య సేవలో ఉండే వైద్యులను సన్మానించుకోవడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు ఏరియా ఆసుపత్రిలో డాక్టర్స్ డే వేడుకలు

నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, మత్తు వైద్యులు పద్మజారాణి, గైనకాలజిస్టు హెలీనాలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మైలవరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు



కొండపల్లి పీహెచ్‌సీలో డాక్టర్ పద్మావతిని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి



జి.కొండూరు పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ శ్వేతను సన్మానిస్తున్న పీఆర్టీయూ ప్రతినిధులు

మీ కోసం అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీ కోసం)లో వచ్చే అర్జీలను గడువులోగా అధికారులు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో తేజోమయి తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే అర్జీలను పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపిస్తామని, వాటిని జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలన్నారు. మొత్తం ఐదు అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, డీఎల్‌పీవో సుందరి, డీఎల్‌డీవో వెంకటరత్నం, హెచ్‌వో ఆర్.హేమ పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులివ్వాలి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు గడిచినా ప్రభుత్వం ఇంతవరకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వకపోవడం దారుణమని, వెంటనే గుర్తింపు కార్డులను జారీ చేయాలని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహా మీ కోసంలో అర్జీని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బొప్పూడి శ్రీ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో ప్రావీణ్యం

మైలవరం: మెర్న్‌ఫుల్ స్టాక్ టెక్నాలజీ అధ్యాపకులకు ప్రావీణ్యత సాధించడానికి దోహదపడుతుందని బిజ్‌ట్రాన్ సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఆర్.అభిషేక్, కె.కిరణ్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో మెర్న్‌ఫుల్ స్టాక్ టెక్నాలజీపై అధ్యాపకులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం రెండు వారాల పాటు కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. ఐటీ ఇండస్ట్రీలో కొత్తగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దటానికి అధ్యాపకులకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ అకడమిక్స్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.5.97 కోట్లు పింఛను సొమ్ము పంపిణీ



ఆగిరిపల్లి హరిజనవాడలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న మంత్రి పార్థసారథి



జి.కొండూరులో వృద్ధురాలికి పింఛన్ నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

జి.కొండూరు: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 8,771మంది లబ్ధిదారులకు ఈ నెల పింఛన్‌ల రూపంలో రూ.5.97 కోట్లు అందుతుందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు, చెవుటూరు, వెంకటాపురం గ్రామాలలో లబ్ధిదారులకు ఆయన పింఛన్ నగదును అందజేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో...

ఇబ్రహీంపట్నం: మండల పరిధి గ్రామాలు, కొండపల్లి మున్సిపాల్టీలోని లబ్ధిదారులకు సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. పింఛన్‌ల పంపిణీలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో పాటు ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎంపీడీవో ఉమాదేవి సచివాలయ ఉద్యోగులతో కలిసి వివిధ రకాల పింఛన్‌లు లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 4,879 మందికి గాను రూ.3.29 కోట్లు, కొండపల్లి మున్సిపాల్టీలోని 10 వార్డు సచివాలయాల పరిధిలో 5,322 మందికి రూ.3.63 కోట్లు నగదు అందించారు. సచివాలయ ఉద్యోగులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గొల్లపూడిలో...

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి కరకట్ట వద్ద సోమవారం మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ లబ్ధిదారులకు పింఛన్లు అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రాలలో...

చంద్రాల(మైలవరం): చంద్రాల గ్రామంలో సోమవారం సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి 770 మందికి పింఛన్ల నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. మైలవరం మండలంలోని కీర్తిరాయునిగూడెం, వెల్వడం గ్రామాలలో జరిగిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

చాట్రాయిలో...

చాట్రాయి: మండలంలో 80 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో మంగా కుమారి తెలిపారు. మొత్తం 8,542 మంది పింఛన్‌దారులకు గాను 7288 మందికి పంపిణీ చేశామని మిగిలిన పింఛన్లు మంగళవారం పంపిణీ చేస్తామన్నారు.

ఆగిరిపల్లిలో...

ఆగిరిపల్లి: మండలంలో 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు. ఆగిరిపల్లిలో మంత్రి కొలుసు పార్థసారథి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. స్థానిక హరిజనవాడలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 9,855 మంది పింఛన్ లబ్ధిదారులకు 6.65 కోట్లు సచివాలయ సిబ్బంది ద్వారా అందజేశామని తెలిపారు.

కె.తాడేపల్లిలో...

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను స్థానిక వీఆర్వో శ్రీనివాసరావు, టీడీపీ ఎస్సీ సెల్ సెక్రటరీ మెండెం జమలయ్య పంపిణీ చేశారు. గ్రామంలోని లబ్ధిదారులకు 7వేల రూపాయల చొప్పున పెన్షన్ పంపిణీ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు టీడీపీ నాయకులు పలువురు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాయనపాడు, జక్కంపూడి, పైడూరుపాడు గ్రామాల్లో గ్రామ సచివాలయాల సిబ్బంది ఆయా గ్రామాల్లోని టీడీపీ నాయకులతో కలిసి పెన్షన్లు పంపిణీ చేశారు.

తిరువూరులో 95 శాతం పెన్షన్ల పంపిణీ

తిరువూరు: తిరువూరు పట్టణంలో సోమవారం సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది కలసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. పట్టణంలో 3442 సామాజిక పెన్షన్లు ఉండగా 95 శాతం పంపిణీ చేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు తెలిపారు. పలు వార్డులలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పెన్షన్ల పంపిణీలో సహకరించారు.

గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ

తిరువూరురూరల్: మండలంలో సోమవారం పేదలకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిట్టేల, రోలుపడి, చింతలపాడు, ముష్టికుంట్ల, మల్లేల, కోకిలంపాడు, లక్ష్మీపురం, మునుకుళ్ళ, కొమ్మిరెడ్డిపల్లి, ఆంజనేయపురం గ్రామాలలో సర్పంచులు తుమ్మలపల్లి శ్రీనివాసరావు, ముండ్లపాటి కాంతమ్మ, చాట్ల దానయ్య, గొల్లమందల కోటయ్య, వంగూరి మరియమ్మ, మాధవీలక్ష్మి, గొల్లమందల శ్రీనివాసరావు, సిరికొండ కుమారి, బంకా వెంకటేశ్వర్లు, మామిడి కుటుంబరావు పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటితో డయేరియా నిర్మూలన

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



డయేరియాపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాతో అతిసార(డయేరియా) వ్యాధిని నిర్మూలించవచ్చని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. కొండపల్లి పీహెచ్‌సీలో డయేరియాపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిసార వ్యాధి చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యశాల సిబ్బందికి సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం, తాగునీరు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం అవగాహన కోసం పోస్టర్ ఆవిష్కరించారు. పీహెచ్‌సీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసు ఉపసంహరించుకోవాలి



హిట్ అండ్ రన్ కేసులు ఉపసంహరించాలని ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, డ్రైవర్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన హిట్ అండ్ రన్(భారతీయ న్యాయ సంహిత చట్టం) ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కొండపల్లిలో లారీ డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం న్యాయ సంహిత చట్టం 2024 జూలై 1 నుంచి అమలు చేయాలని చూడటం డ్రైవర్ల మెడపైన కత్తి వేలాడతీసినట్లు ఉందన్నారు. ప్రమాదాల నివారణకు చట్టం ఏర్పాటు చేసినప్పటికీ పొరపాటున హిట్ అండ్ రన్ కేసు అయితే అన్ని రకాల వాహనదారులకు 7 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. చట్టం అమలుపై పునరాలోచన చేయాలని కోరారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన సదస్సు

చాట్రాయి: డయేరియా నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో మంగా కుమారి తెలిపారు. సోమవారం చాట్రాయిలో నిర్వహించిన స్టాప్ డయేరియా అవగాహన సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఇప్పటి నుంచి ఆగస్టు 31 వరకు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి 5 సంవత్సరాల్లోపు పిల్లలకు వచ్చే డయేరియాపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. డయేరియా నివారణకు ఓఆర్‌ఎస్, జింకు ట్యాబ్లెట్లు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఎం.జ్యోతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పీఎం ఉజ్వల యోజన-2 ప్రారంభం

ఆగిరిపల్లి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం-2 జూలై 1 నుంచి ప్రారంభమైందని ఈ పథకాన్ని నియోజకవర్గ ప్రజలందరూ ఉపయోగించుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జీ ఆర్‌కే రంగారావు తెలిపారు. ఈ పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్, ప్రతి సంవత్సరం మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా ఇస్తారన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత

ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెంలోని చుక్కపల్లి హైస్కూల్లో 580 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన ఐదుగురు విద్యార్థులకు సోమవారం చుక్కపల్లి చారిటబుల్ ట్రస్ట్ అధినేత చుక్కపల్లి సుధ ఒక్కో విద్యార్థికి రూ.25 వేల నగదును, రూ.2 వేల విలువ గల వాచీలను అందజేశారు.

డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ

ముసునూరు: డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా సోమవారం ముసునూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన ఓఆర్‌ఎస్, జింక్ కార్నర్‌ను సర్పంచ్ కె.విజయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

లోపూడి (ముసునూరు): లోపూడిలో రెండేళ్ల క్రితం నిర్మించిన రాధమ్మ సమేత శ్రీకృష్ణుడి ఆలయం వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తుల గోపాల నామ స్మరణ, పురోహితుల వేద మంత్రోచ్చరణల నడుమ స్వామి వారికి ప్రధానార్చకులు కిరణ్‌కుమార్, రాజా శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీకి చెందిన పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామి వారి కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, భజనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం వెయ్యి మంది భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.

4న విద్యా సంస్థల బంద్

తిరువూరు: ఈ నెల 4న విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా నాయకుడు బలగాని వెంకటేశ్వరరావు తెలిపారు. జాతీయస్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలలో అవకతవకలు, అక్రమాలు జరగడం, కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యంపై నిరసన తెలుపుతూ ఈ బంద్ చేపడుతున్నట్లు తెలిపారు.

లయన్స్ క్లబ్ నూతన పాలకవర్గం ఎన్నిక

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి లయన్స్ క్లబ్ నూతన పాలకవర్గం ఎన్నిక కొండపల్లి లయన్స్ క్లబ్ కంటి వైద్యశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు(2023–24) ఎస్.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా నేపా సత్యన్నారాయణ, ఇన్‌స్టాలేషన్ అధికారిగా గోపీనాథ్, ఇండక్షన్ అధికారిగా దేవినేని జోనీకుమారి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్‌గా దేవినేని కిషోర్‌కుమార్, కార్యదర్శిగా ఎస్.శ్రీనివాసరావు, కోశాధికారిగా దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథి ఎస్‌వీఎస్ నివృతిరావు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

పెనుగొలను(గంపలగూడెం): సొసైటీల ద్వారా తీసుకున్న రుణాలను రైతాంగం సకాలంలో చెల్లించటం ద్వారా తగిన పరపతి పొంది తిరిగి వ్యవసాయ అవసరాలకు రుణం తీసుకోవాలని గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఈ ఏడాది మెంబర్ స్థాయిలో నూరుశాతం రుణాలు వసూలయ్యాయి. ఈ సందర్భంగా బ్యాంక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ సీఈవో నామా నరసింహారావును మేనేజర్ అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. సొసైటీ పరిధిలో 1,120 మంది రైతులు 20.38కోట్లు చెల్లించాల్సి ఉండగా నూరుశాతం వసూలైనట్లు మేనేజర్ వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ రాయనపాడు ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో మంగళవారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఖలీల్ భాయ్ రెస్టారెంట్ ఏరియా, నల్లకుంట, రస్నా కోల్డ్ స్టోరేజ్ ఏరియా, శాంతినగర్, రవి కల్పతరు ప్లాట్స్ ఏరియా, రాయనపాడు పంచాయతీ ఆఫీస్ ఏరియా, యాదవుల బజార్, అలంకార్ బీరువా కంపెనీ ఏరియా, పైడూరుపాడులలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గ్యాస్ కనెక్షన్ల ఈకేవైసీ గ్రామాల్లో నిర్వహించాలి

చాట్రాయి: గ్యాస్ కనెక్షన్ల ఈకేవైసీ గ్రామాల్లో నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో సుమారు 800 ఇండియన్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని ఈకేవైసీ చేయించాలంటే అన్ని గ్రామాల నుంచి మహిళలు చాట్రాయి రావాల్సి వస్తోందన్నారు. మహిళల ఇబ్బందుల దృష్ట్యా గ్రామాల్లో ఈకేవైసీ చేయించాలని ఆయన కోరారు. ఈమేరకు తహసీల్దార్ మహ్మద్ మసూద్‌కి వినతిపత్రం అందజేశారు.